ప్రతి ఇంటిలో వివరాలు సేకరించాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : తెలంగాణ కుటుంబ గుర్తింపు కార్డు కోసం ప్రతి ఇంటి నుంచి వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. గురువారం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి డిజిటల్ సర్వే బృంద సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ కుటుంబ సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా వనపర్తి పదో వార్డు, మండలంలోని అంజనగిరి గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. గ్రామపంచాయతీలో రెండు సర్వేబృందాలు, పురపాలికలో మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 7న సాయంత్రంలోపు పూర్తి చేసేందుకు గడువు విధించారు. బృందసభ్యులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డీఆర్‌డీవో ఉమాదేవి, పుర కమిషనర్ పూర్ణచందర్, డీపీవో సురేశ్, తహసీల్దార్ రమేశ్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ కుటుంబ గుర్తింపు కార్డు సర్వేలో భాగంగా కుటుంబసభ్యుల వివరాల సేకరణ పకడ్బందీగా చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్ అన్నారు. వనపర్తి పట్టణం పదో వార్డు నాగవరం, మండలంలోని అంజనగిరి గ్రామంలో ప్రారంభమైన ఇంటింటి సర్వేను ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఆదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ పరిశీలించారు. ఈయన వెంట పుర కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


నాగవరంలో సర్వేను పరిశీలిస్తున్న రవినాయక్

శైలపుత్రిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే : జోగులాంబ ఆలయంలో గురువారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమ నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. అర్చకులు ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణ నిర్వహించారు. మొదటి రోజున అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించారు.



వైద్య సేవలకు గర్భిణుల అవస్థలు


రేడియాలజిస్టు లేక మూతబడిన టిఫా స్కానింగ్‌యంత్రం గది

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : గర్భిణుల కడుపులో పెరిగే పిండంతో పాటు ఆరోగ్య పరిస్థితి, ఎదుగుదలను తెలుసుకోవడానికి ఉపయోగపడే టిఫా స్కానింగ్ కోసం తిప్పలు పడాల్సి వస్తోంది. వనపర్తి ఎంసీహెచ్ ఆసుపత్రిలో గత ఏడాది రేడియాలజిస్టు (ఎస్‌ఆర్) ఉండటంతో గర్భిణులకు టిఫా స్కానింగ్ చేసేవారు. ఆయన ఇటీవల వెళ్లిపోవడంతో సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి సేవలు నిలిచిపోయాయి. ప్రైవేట్ ల్యాబ్‌ల వద్దకు వెళ్లి స్కానింగ్ చేయించుకోవాలంటే రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

సిబ్బంది తీరుపై విమర్శలు

స్కానింగ్ నివేదికలు ఇవ్వక పోవడంతో పాటు ఆసుపత్రికి ప్రసవాల కోసం వచ్చే గర్భిణులతో వైద్య సిబ్బంది వ్యవహరించే తీరు వివాదాస్పదమవుతోంది. దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధితాధికారులు స్పందించి అమర్యాదకరంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిబ్బందిపై చర్యలు తప్పవు: గతంలో గర్భిణులతో అమర్యాదకరంగా వ్యవహరించిన విషయం మా దృష్టికి వచ్చింది. అలా వ్యవహరించవద్దని సిబ్బందికి హెచ్చరించా. రేడియాలజిస్టు లేక పోవడం వల్ల జరిగే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. అమర్యాదకరంగా వ్యవహరిస్తున్న సిబ్బందితో మాట్లాడి మరో మారు ఇలా కాకుండా చూస్తాం.

– రంగారావు, ఆసుపత్రి పర్యవేక్షకుడు

పట్టించుకోవడం లేదు



ప్రసవం కోసం ఎంసీహెచ్ ఆసుపత్రికి వారం రోజుల కిందట వచ్చాను. సిబ్బంది ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలి. గర్భిణుల ఆరోగ్య పరిస్థితి మేరకు ప్రసవాలు చేయాలి.

– మనీషా, ఏదుట్ల గోపాల్‌పేట మండలం

అమర్యాదకరంగా వ్యహరిస్తున్నారు



పురిటి నొప్పులు వచ్చాయని చెప్పినా సిబ్బంది పట్టించుకోవడం లేదు. అమర్యాదకరంగా వ్యవహరిస్తున్నారు. రక్తపోటు పెరిగితేనే ప్రసవం చేస్తామని చెప్పారు. ఆసుపత్రిలో టిఫా స్కానింగ్ చేసేందుకు నిపుణుడిని నియమించాలి.

– లక్ష్మి, వెంకటాంపల్లి, ఖిల్లాగణపురం మండలం

పాముకాటుకు మెరుగైన చికిత్స


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి జయ చంద్రమోహన్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పాముకాటు చికిత్సకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. పాముకాటుకు గురైన వారు వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. ఇటీవల గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామానికి చెందిన బాలమ్మ నాగుపాము కాటుకు గురవగా సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ స్పందించి వనపర్తి ఆసుపత్రికి తరలించారన్నారు. వైద్యులు ఆమెకు చికిత్స అందించడంతో ప్రాణాప్రాయం తప్పిందన్నారు. ప్రజలు నాటువైద్యం చేయించుకుని ప్రాణాలు కోల్పోవద్దని సూచించారు. సమావేశంలో కృష్ణసాగర్, జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవో జావీద్ హుసేన్, హెచ్‌ఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వరిధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వరి ధాన్యం కొనుగోళ్లు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ధాన్యం తడిచిపోకుండా వాతావరణ నివేదిక ఆధారంగా కేంద్రాలకు సమాచారమిస్తామన్నారు. గన్నిబస్తాలు, టార్పాలిన్, వరి ఆరబెట్టే యంత్రాలు, అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో ఫిర్యాదు కేంద్రం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఎస్పీ గిరిధర్, అదనపు కలెక్టర్లు సంచిత్‌గంగ్వార్, నగేశ్, డీఆర్‌డీవో ఉమాదేవి, వ్యవసాయ జిల్లా అధికారి గోవిందునాయక్, పౌరసరఫరాల అధికారులు కాశీవిశ్వనాథ్, ఇర్ఫాన్, కో ఆపరేటివ్ అధికారి ప్రసాదరావు, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న వెంకట నరసమ్మ

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ఫలితాల్లో ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన అధ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన గురువారం కొనసాగింది. 1:3 నిష్పత్తి ప్రకారం 153 మందిని పిలవగా 133 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో ఎస్జీటీ 65 మంది, స్కూల్ అసిస్టెంట్లు జీవశాస్త్రం 18, భౌతికశాస్త్రం 3, గణితం 9, సాంఘీక శాస్త్రం 10, తెలుగు 4, హిందీ 6, ఆంగ్లం 5 మంది అభ్యర్థులు, భాషా పండితులు 7, పీఈటీలు 5, పీడీ ఒకరు ఉన్నారు. రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ సంయుక్త సంచాలకురాలు, ధ్రువపత్రాల ప్రత్యేక పరిశీలకురాలు వెంకట నరసమ్మ పరిశీలించారు. అభ్యర్థులకు ప్రత్యేకంగా సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ధ్రువపత్రాల పరిశీలన రెండు రోజులే ఉండటంతో 1:3లో ఉన్న అభ్యర్థులు త్వరగా వచ్చి పరిశీలన పూర్తి చేసుకోవాలని జిల్లా ధ్రువపత్రాల పరిశీలన ఇన్‌ఛార్జి రవీందర్ చారి సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షులు అజీమ్ బాషా, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శక్తిపీఠంలో ఉత్సవాలు ప్రారంభం



ప్రదక్షిణ చేస్తున్న ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, మాలధారణ భక్తులు

అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మీ ముహూర్తంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ఈవో పురేందర్, అర్చక స్వాములు మంగళ వాయిద్యాలతో ప్రధాన ఆలయాలకు చేరుకొని ఆనతి స్వీకరించారు. గణపతి పూజలు, పుణ్యాహవాచన, కంకణధారణ, కలశస్థాపన, యాగశాలలో నాలుగు వైపులా ప్రత్యేక మండపారాధన మధ్యలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులతో మహాకలశ స్థాపన చేశారు. లోక కల్యాణార్థం మహాసంకల్పం పాటించి అఖండ దీపారాధన చేశారు. షోడషోపచార పూజలు, తదితరాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు.

శైలపుత్రిగా జోగులాంబ: ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వంతెన నుంచి వెళ్లలేక ఆగిన సుబాబుల్ లోడు లారీ

మొత్తుకున్నా వినలే.. ఎత్తు పెంచలే!

శాంతినగర్, న్యూస్‌టుడే: భారత్‌మాల రోడ్డు వంతెనల ఎత్తు పెంచాలని రైతులు మొత్తుకున్నా, నిరసనలు చేసినా, పనులను అడ్డుకున్నా.. అధికారులు పట్టించుకోలేదు.. యాజమాన్యం ఒప్పుకోలేదు. తక్కువ ఎత్తులో నిర్మిస్తున్న వీటి కారణంగా రైతులకు ఇదిగో ఇలా కష్టాలు తప్పవు. రాజోలి నుంచి శాంతినగర్‌కు వచ్చే రోడ్డుపైన నిర్మించిన వంతెన నుంచి వెళ్లలేక గురువారం ఆగిపోయిన సుబాబుల్ లోడు లారీ సాక్షిగా..

వేలాది గ్రామాలకు సమస్యే: గద్వాల జిల్లాలో భారత్‌మాల రహదారి ఎనభై కిలోమీటర్ల దూరం వెళుతోంది. రహదారికిరువైపులా వందలాది గ్రామాలున్నాయి. రహదారితో ప్రస్తుతం ఈ గ్రామాల నడుమ రాకపోకలు తెగిపోయాయి. అక్కడక్కడా నిర్మించిన పదుల సంఖ్యలో వంతెనలు ఇదిగో ఇలా తక్కువ ఎత్తులోనే ఉండిపోయాయి. దీంతో అటూ ఇటూ వ్యవసాయ ఉత్పత్తులతో వాహనాలు వెళ్లడం కష్టం కానుంది. కాలువ కట్టలపైనైతే ఈ రహదారిని దాటే పరిస్థితే లేకుండాపోయింది. కాలువ వరకే వంతెన నిర్మించడంతో కట్టను రహదారిలో కలిపేశారు.

నిరసనలు తెలిపినా

వంతెనల ఎత్తు విషయంలో అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు పలు ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. గట్టు మండలంలో ఏకంగా నిరాహార దీక్షలు చేపట్టారు. నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సమస్యపై మీడియాలో మొదటి నుంచీ కథనాలు వస్తూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గురువారం తుమ్మిళ్ల రైతులు లారీలో సుబాబుల్ తీసుకువస్తూ బ్రిడ్జి వద్ద ఇబ్బంది పడ్డారు. ఎత్తు తక్కువగా ఉండటంతో తీసుకువచ్చిన సుబాబుల్‌లో కొన్ని కిందకు దించి బ్రిడ్జి దాటిని తర్వాత తిరిగి లోడు చేసుకున్నారు. ఇది రైతులకు ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనల కింద నుంచి సుబాబుల్, ధాన్యం, పత్తి, మిరప, జొన్న, పశుగ్రాసం లాంటివి రవాణా చేయాలంటే ఇదే పరిస్థితి ఎదురుకానుంది.



మహబూబ్‌నగర్ : రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి అలంకరణ




మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీ వాసవీమాత ఆలయంలో ఉమాదేవిగా దర్శనం



అచ్చంపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో..



శాంతినగర్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో



కల్వకుర్తి: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

సమ్మోహనం.. సుందరరూపం

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారు బాలా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. దేవాలయాల్లో ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగజ్జననిని దర్శించుకునేందుకు ఆలయాలకు తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు.

-న్యూస్‌టుడే బృందం



పెబ్బేరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహబూబ్‌నగర్ : అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో ఆర్యవైశ్యులు



ఊట్కూరు: బిజ్వార్‌లో బండారు చల్లుకునే కార్యక్రమంలో భక్తులు



కొత్తకోట : కానాయపల్లి శ్రీకోటిలింగేశ్వరాలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా ..



అమ్రాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు



గద్వాల : ప్రతిమను ఊరేగిస్తున్న తెలుగుపేట శివాలయం కమిటీ సభ్యులు



అయిజ అంబాభవానీ ఆలయంలో..



గద్వాల గంటవీధిలో..



ఊట్కూరు: అంబాత్రయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామి



నాగర్‌కర్నూల్: అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు సందర్భంగా బొడ్డెమ్మలు వేస్తున్న మహిళలు



అచ్చంపేట: కుంకుమార్చన చేస్తున్న భక్తులు



వనపర్తి: చిట్యాలలో..




మహబూబ్‌నగర్ : వేంకటేశ్వరకాలనీలోని రాజరాజేశ్వరీఆలయంలో భక్తుల సందడి

వృత్తి ఎస్పీ.. ప్రవృత్తి చిత్రలేఖనం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వృత్తిలో ఎస్పీగా ఉంటూ చిత్రలేఖనం, సాహిత్యాన్ని ప్రవృత్తిగా కొనసాగిస్తున్నారు రావుల గిరిధర్. తల్లి చీరలపైన వేసే డిజైన్లు, ఇంటి ఎదుట అలంకరించే ముగ్గులను చూసి చిత్రాలను గీయడంపై ఆసక్తిని పెంచుకున్నారాయన. సాహిత్యంపై మక్కువ కనబరుస్తూ కవితలు రాశారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా సమర్థంతంగా విధులు నిర్వహిస్తున్నే. చిత్రాలు గీస్తూ, కవితలు రాస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు వనపర్తి ఎస్పీ గిరిధర్.

స్వచ్ఛంద కార్యక్రమాల్లో

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు రావుల క్షేమ, నిరంజనాచారిల కుమారుడు గిరిధర్. ఆయన పీజీ వరకు చదువుకున్నారు. పలు స్వచ్ఛంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. సామాజిక సేవలు ఇష్టంగా భావించే వారు. 2007లో జరిగిన సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో జైల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం సాధించి వరంగల్‌లో విధులు నిర్వహించారు. 2010లో రాసిన సివిల్స్‌లో ఆయన ఉద్యోగం సాధించి డీఎస్పీగా గురజాల, భైంసా, సుల్తాన్‌బజార్, గజ్వేల్‌లో పనిచేశారు. అనంతరం పదోన్నతి పొంది మహబూబాబాద్‌లో ఏఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం పోలీసు శాఖలో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2017లో ఎస్పీగా పదోన్నతి పొంది డీసీపీగా పనిచేశారు. ఇటీవల వనపర్తి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.







చిత్రాలు గీస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ప్రవృత్తిలో గురువు తల్లి

తన తల్లి క్షేమను ఆదర్శంగా తీసుకుని చిత్రలేఖనంలో ఆసక్తిని పెంచుకున్నారు. ఆమెకు డిజైనింగ్‌లో ప్రవేశముంది. ఇంటి వద్ద ఆమె వేసే వివిధ రకాల డిజైనింగ్ బొమ్మలను చూసి అనుకరించేవారు. ఇంటి ఎదుట వేసే వాటిని చిత్రరూపంలో ప్రదర్శించడంలో ఆసక్తి కనబర్చేవారు. ఇలా సమయం దొరికినప్పుడల్లా ఆయనకు ఆసక్తి కలిగించే బొమ్మలను గీసేవారు. ఇప్పటి వరకు 60 వరకు బొమ్మలను గీశారు. ఆయన గీసిన బొమ్మల్లో జంతుప్రపంచం, పక్షులు, చెట్లు, సెలయేరు వంటి ప్రకృతి రమణీయతలను తన చిత్రాల్లో పొందుపరుస్తున్నారు. సాహిత్యంలోనూ మక్కువ ప్రదర్శిస్తున్నారు. కవితలంటే ఆయనకు పంచప్రాణం. శోధన పేరిట ఆయన కవిత సంపుటి 2020 సంవత్సరంలో ప్రచురితమైంది. పలు కవితలతో కూడిన మరో సంపుటి అహింస హృస్మి అనే కవిత సంపుటి ప్రచురణలో ఉంది.

సమాజ హితమే పరమావధి : సమాజ హితమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేస్తే ప్రజా సమస్యలకు తావుండదు. సేవ చేయాలన్న లక్ష్యం చిన్ననాటి నుంచే అలవడింది. పోలీసు శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉంటూ నా పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన శ్రద్ధ వహిస్తున్నా. శాంతిభద్రతలే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నా. వృత్తిలో ఆదర్శంగా ఉండటంతో పాటు ప్రవృత్తిపై సమయం దొరికినప్పుడల్లా శ్రద్ధ చూపుతున్నా.

- రావుల గిరిధర్, ఎస్పీ

పల్లె ఓటర్లు @ 23,22,054

పురుషుల కంటే 13,765 మంది మహిళలు అధికం

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 23,22,054 ఓటర్లున్నట్లు లెక్క తేల్చింది. పురుషులు 11,54,128 మంది ఉండగా, మహిళా ఓటర్లు 11,67,893 మంది ఉన్నారు. ఇతరులు 33 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 13,765 మంది అధికంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరుచేసి ఈ జాబితాను గత నెల 13న ప్రచురించారు. గ్రామ పంచాయతీల్లో వీటికి సంబంధించి గత నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 28న తుది జాబితా ప్రచురించగా దీన్ని ఎన్నికల సంఘం వెలువరించింది. దీని ఆధారంగా జిల్లాల వారీగా పంచాయతీలు, వార్డుల్లోని ఓటర్లతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మరో పర్యాయం ఓటరు నమోదుకు కూడా అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

* నాలుగు జిల్లాల్లో అతివలదే పైచేయి.. : తాజాగా ప్రచురించిన గ్రామ పంచాయతీ ఓటర్ల ఆధారంగా నాలుగు జిల్లాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నట్లు తేలింది. అత్యధికంగా నారాయణపేట జిల్లాలో పురుషుల కంటే మహిళలు 7,348 మంది అధికంగా ఉండటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళా ఓటర్లు ఏకంగా 5,562 మంది అధికంగా ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,118 మంది మహిళలు అధికంగా ఉన్నారు. వనపర్తి జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 753 మంది ఎక్కువగా ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పురుష ఓటర్లు మహిళల కంటే 1,016 మంది అధికంగా ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల వివరాలు, పంచాయతీలు, వార్డులు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	14	441	3,836	2,57,529	2,58,647	7	5,16,183
నాగర్‌కర్నూల్	20	464	4,140	3,23,705	3,22,689	13	6,46,407
వనపర్తి	14	260	2,366	1,83,382	1,84,135	4	3,67,521
జోగులాంబ	12	255	2,390	1,91,313	1,96,875	7	3,88,195
నారాయణపేట	11	280	2,544	1,98,199	2,05,547	2	4,03748

నవరాత్రి వేడుకల్లో రాజవంశీయులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలిటెక్నిక్ బంగ్లా పక్కన గుడిలో గురువారం నిర్వహించిన నవరాత్రి పూజల్లో రాజా రామేశ్వర్‌రావు వారసుడు రాజా కృష్ణదేవరాయుడు కుమారుడితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



రాజవంశీయులతో అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు

అనంతరం జిల్లా అఖిల పక్ష ఐక్య వేదిక నాయకులు రాజా వారిని కలిసి సన్మానించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు సతీశ్ యాదవ్ మాట్లాడుతూ తరాలుగా వస్తున్న సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం స్ఫూర్తిదాయకమన్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలక పాత్ర పోషించారు.



సెంచరీతో రాణించిన నిజామాబాద్ జట్టు క్రికెటర్ విక్రాంత్‌రెడ్డి(137 పరుగులు)

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో ఆల్‌రౌండర్ తక్షిల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ: మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల్లో మార్పు కోసమే పాదయాత్ర

ఉండవల్లి, న్యూస్‌టుడే: భావితరాలకు ఉపయోగపడే విధంగా నడచుకునేలా ప్రజల్లో మార్పు కోసమే 'బాపూ బాటలో సత్యశోధన పాదయాత్ర' చేపట్టినట్లు విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా. శివార్చక విజయకుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఈ నెల 2న అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి ప్రారంభమైన (100 రోజుల్లో 1000 కి.మీ) పాదయాత్ర గురువారం ఉండవల్లికి చేరుకుంది. గ్రామస్థులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలను తల్లిదండ్రులు, పెద్దలు అలవాటు చేయాలన్నారు. చేనేత వస్త్రధారణకు ప్రోత్సాహం, మద్యం, మత్తు పదార్థాల నివారణ, స్వదేశీ వైద్యం ఆదరించటం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం, యోగా, పౌష్టికాహారం, నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య అందించడం తదితరాలను వివరించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు దేవన్న, తదితరులు పాల్గొన్నారు. యాత్ర శుక్రవారం ఉండవల్లి నుంచి బొంకూరుకు సాగనుంది.



కరపత్రాలు అందజేస్తున్న శివార్చక విజయకుమార్ తదితరులు

పోలీస్ అధికారుల్లో నైపుణ్యాల మెరుగుకు కృషి : డీఐజీ



మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఏఎస్పీ రాములు, అధికారులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీస్ అధికారుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారుల నైపుణ్య కార్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నేరస్థులు ఎవరూ తప్పించుకోవడానికి వీలు లేకుండా నేరాల విచారణ, పరిశోధన మెరుగుపడాలన్నారు. కార్యశాలలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి. జానకి, ఏఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఏఎస్పీ రామేశ్వర్, వనపర్తి ఏఎస్పీ రామ్‌దాస్, నారాయణపేట ఏఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నర్సింహులు, గద్వాల డీఎస్పీ నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల, న్యూస్‌టుడే : విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముండే ఓ విద్యార్థిని(17) మహబూబ్‌నగర్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటాక ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తర్వాత గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చికెన్ ధరలు

ఫాంరేటు	112-00
రిటైల్	134-00
డ్రెస్డ్	194-00
స్కిన్‌లెస్	221-00


పైపులైన్ లీకేజీతో వృథా అవుతున్న నీరు

సమస్య : పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీ రాజేందర్ ఇంటి కూడలి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయ్యింది. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. **- అజయ్, అమరచింత**

సమాధానం: పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేయించి సమస్య పరిష్కరిస్తాం.
- నూరుల్ నజీబ్, కమిషనర్, అమరచింత
–న్యూస్‌టుడే, అమరచింత

తెరపై ఈనాడు
శ్రీనివాస: **దేవర,** వెంకటేశ్వర: **దక్షణ,** శ్రీరామ: **స్వాగ్**
–న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

రహదారి భద్రతా సమావేశానికి విధిగా హాజరుకావాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : రహదారి భద్రత సమావేశానికి సంబంధిత అధికారులు విధిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. గురువారం రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత త్రైమాసిక సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశానికి హాజరుకాని అధికారులకు శ్రీముఖాలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రతపై గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుపై పూర్తి నివేదికలు లిఖిత పూర్వకంగా ఇవ్వాలన్నారు. సమావేశంలో రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్లు దేశ్యానాయక్, మల్లయ్య, డీఎస్పీ దానకిశోర్, ఆర్టీవో మానస, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి తగ్గుతున్నా ఎగువ, దిగువ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టుకు 62,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 40,279 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఐదు యూనిట్ల ద్వారా 4.312, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.684 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 225.267, దిగువన 200.344 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి సాధ్యపడిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు ఆర్థికసాయం

పెబ్బేరు, న్యూస్‌టుడే : తను చదివిన పాఠశాల అభివృద్ధికి ఎన్నారై శ్రీహరి రెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆస్ట్రేలియాలో ఉన్న శ్రీహరి రెడ్డి పండగ సందర్భంగా గురువారం స్వగ్రామమైన యాపర్ల వచ్చారు. తను చదివిన పాఠశాలను సందర్శించారు. పాఠశాల శిథిలమై ఉండటంతో రూ.50 వేల చెక్కును గ్రామ పెద్ద స్వరాజ్యం బాబురెడ్డికి అందజేశారు. అవసరమైతే మళ్లీ కొంత నగదు అందించే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారని జీహెచ్ఎం శంకర్ గౌడ్ తెలిపారు.

'ఆశా కార్యకర్తలతో వెట్టి చాకిరి తగదు'

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆశ కార్యకర్తలతో వెట్టి చాకిరి పనులు చేయించడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సమస్యలపై చర్చించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ చేయాల్సిన పనులు ఆశాలతో చేయించడం సరికాదన్నారు. అనంతరం వారి సమస్యలపై జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజ, ఇందిరా, చిట్టెమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎస్సై బి.సురేశ్ పేర్కొన్నారు. గురువారం మిట్టనందిమల్ల గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి సర్వారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ఓ వృత్తివిద్య కళాశాలలో న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి కేంద్ర నిర్వాహకురాలు కవిత, లోక్ అదాలత్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : రైతులకు కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలకు, రుణ విమోచనకు చట్టం తేవాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో శ్రీరంగాపురంలో గురువారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 3 అక్టోబర్ 2021న లఖింపూర్‌ఖేరీ టికునియాలో కేంద్ర హోంశాఖ సహాయ మాజీ మంత్రి కుమారుడు నలుగురు రైతులను, ఒక విలేకరిని కారుతో తొక్కించి చంపారని, రైతులకు ఆత్మశాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సమితి జిల్లా నాయకులు పాల్గొన్నారు.


శ్రీరంగాపురం రాజులగట్టులో అమ్మవారికి పూజలు


ఆత్మకూరులో మహిళల పూజలు..


స్వర్ణకార సంఘం నాయకులు..


పెబ్బేరులో అమ్మవారి పల్లకీసేవ

నవదుర్గా.. నమోస్తుతే


వనపర్తి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దుర్గామాత

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మొదటి రోజు దుర్గామాత బాలత్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో గురువారం ఆత్మకూరులో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక బాలబ్రహ్మేశ్వర, వాసవీ కన్యకాపరమేశ్వరి, వాల్మీకినగర్, కేశవనగర్, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆయా ఆలయాల్లో వివిధ రూపాల్లో అలరించి పూజలు చేశారు. వాసవీమాత ఆలయంలో బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణతో కొలిచారు. సాయంత్రం పలు మండపాల వద్ద బతుకమ్మ నృత్యాలతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో పుర అధ్యక్షురాలు గాయత్రి పూజలు చేశారు. స్వర్ణకారులు వేర్వేరు ఆలయాల్లో అమ్మవారి విగ్రహాల మండపాలను ఏర్పాటు చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, స్థానిక నాయకులు బంగారు భాస్కర్, ఆవోపా జిల్లా అధ్యక్షుడు దోమ శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బాలేశ్వర్, యువజన సంఘం నాయకులు శ్రీధర్, ప్రవీణ్, వై.రాము, పుర ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి, న్యూస్‌టుడే: చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో దుర్గామాత కొలువుదీరింది. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : మండలంలోని రంగనాథస్వామి ఆలయం, వివిధ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. తొలిరోజు బాలాత్రిపురసుందరిగా అలంకరించి పూజలు చేశారు.

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కానాయపల్లి శ్రీకోటిలింగేశ్వరాలయంలో జ్ఞానాంబిక అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిగా, పట్టణంలోని అంబా భవానీ ఆలయంలోని అమ్మవారు శ్రీలలితదేవిగా, నిర్వెన్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి పూజించినట్లు ఆలయ అర్చకులు జగదీశ్, ఆనంద్, సదాశివుడు తెలిపారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని కేతేపల్లి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బాలాత్రిపుర దేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో వీర ప్రతాప్, చంద్రమౌళి, రాంబాబు, శ్రీనివాస్, మాణిక్యం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దమందడిలో పూజలు...

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గోపాల్‌పేటలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పండితులు రంగాచార్యులు, గోపాలాచార్యులు, రాఘవేంద్ర ఆచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా భవానీ సేన, తొగుట వీర క్షత్రియ సంఘం, వాసవీ మాత కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి కలశాలు, బతుకమ్మలు, భజన కీర్తనలతో అమ్మవారిని పురవీధులలో ఊరేగించారు. ఆయా దేవాలయాల్లో కనకదుర్గ దేవీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. కన్యకా పరమేశ్వరి, చిన్న చౌడేశ్వరి ఆలయంలో వాసవీ మాత బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజలలో ఆలయ కమిటీ సభ్యులు, హిందూ జాగృతం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలో రాజీవ్ కూడలి, శివాజీనగర్, జగన్‌వాడ, బీసీ కాలనీలో నిర్వాహకులు మండపాలను సిద్ధం చేసి అర్చకులతో దుర్గామాత ప్రతిమలను ప్రతిష్ఠించారు. కాళికాలయం ఆవరణలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అంకురార్పణ పూజ, ధజారోహణం జరిగింది.


చిన్న చౌడేశ్వరి ఆలయంలో బాలాత్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి


కొత్తకోట అంబా భవానీ ఆలయంలో..


వనపర్తి ఐజనగర్ కాలనీలో...


కొత్తకోట నిర్వెన్‌లో..


గోపాల్‌పేటలో..


అమరచింత రాజీవ్ కూడలిలో దుర్గమ్మకు పూజలు


పెబ్బేరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవదుర్గలు

మంచినీటి పథకాల మరమ్మతులపై శిక్షణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మకూరు, అమరచింత మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల తాగునీటి సరఫరా సిబ్బందికి కొనసాగుతున్న నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం పైప్‌లైన్ల మరమ్మతులపై అవగాహన కల్పించారు. ఏఈ రుకేందర్‌రెడ్డి, ఎంపీడీవో సుజాత, ఎంపీవో శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోపాల్‌పేటలో శిక్షణ ఇస్తున్న నిపుణుడు

పాన్‌గల్, న్యూస్‌టుడే : గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ కార్మికులుగా పనిచేస్తున్నవారు మంచినీటి పథకాలకు సంబంధించి పూర్తిస్థాయిలో అవగాహన ఉంటే సమస్యల పరిష్కారానికి ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమిత్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని మల్టీపర్పస్ వర్కర్లకు గురువారం తాగునీటి పైపుల లీకేజీలు, చేతిపంపుల మరమ్మతులు, మోటార్ల తొలగింపుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి పనులు ఏవిధంగా చేయాలో చూపించారు. సమావేశంలో ఏఈ ఉదయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సహాయకులను నియమిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జయపాల్‌రెడ్డి తెలిపారు. గోపాల్‌పేట, రేవల్లి మండలాలకు చెందిన మంచినీటి సహాయకులకు ఇస్తున్న శిక్షణ శిబిరానికి గురువారం డీఈ హాజరై మంచినీటి బోర్ల మోటార్లు, ప్యానెల్ బోర్డుల మరమ్మతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఏఈ మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష


పుర అధికారులతో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : కొత్తకోట పురపాలిక సంఘం అభివృద్ధిపై ప్రజారోగ్య, పుర అధికారులు, విద్యుత్తు శాఖ అధికారులతో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో మూడు కి.మీ.కు సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో పైపులైన్ నిర్మాణాలు చేపట్టే అవకాశాలుంటాయని ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా చూడాలన్నారు. పాత గ్రామ పంచాయతీ భవనం స్థలంలో భూసేకరణ అవసరం లేకుండా పురపాలిక భవన నిర్మాణానికి పరిశీలించాలన్నారు. విద్యుత్తు సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, ఈఈ విజయ్‌భాస్కర్, ఏఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా.. అధికారులపై వేటు


ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న పొక్లెయిన్(పాత చిత్రం)

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: దుందుభి వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాలో విఫలమైన అధికారులపై వేటు పడింది. ప్రత్యేక నిఘా బృందం సేకరించిన సమాచారం మేరకు వంగూరు, ఉప్పునుంతల, తెలకపల్లి, బిజినేపల్లి ఎస్సైలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. దీంతో వీరిని ఠాణా నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి డివిజన్ల పరిధిలో మొదటిసారి ఎస్సైలపై వేటు పడటంతో గనులు, రెవెన్యూ, పోలీసు అధికారుల్లో చర్చ మొదలైంది. మార్చి నుంచి జూన్ వరకు వాగు పరిధిలో విధులు నిర్వహించి వసూళ్లకు పాల్పడిన అధికారుల్లో భయాందోళన మొదలైంది.

- దుందుభి వాగు పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకున్న వ్యాపారులు ఈ ఏడాది జులై వరకు టన్నుల కొద్దీ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు. ఉప్పునుంతల మండలం సదగోడు, మొల్గర, తిర్మలాపూర్, దాసర్లపల్లి, కాంసానిపల్లి, వంగూరు మండలం మిట్టసదగోడు, చింతపల్లి, పోతిరెడ్డిపల్లి శివారు వ్యవసాయ పొలాల్లో డంపులు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్‌కు రూ.4వేల చొప్పున అధికారుల అండదండలతో అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి అనుకూల సమయం కావడంతో రవాణా జోరందుకుంది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణాను అరికట్టడంలో విఫలమైన అధికారులపై వేటు పడింది.

ఈదురు గాలులకు కూలిన చెట్టు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు చెట్లు విరిగాయి. లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద నీలగిరి చెట్టు కూలి విద్యుత్తు తీగలపై పడటంతో స్తంభం విరిగింది. సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు, పుర సిబ్బంది చెట్టు, తీగలను తొలగించి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.


కర్నూలుకు వెళ్లే రహదారిలో కూలిన చెట్టు

రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గోపాల్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. గతనెల 27న జోగులాంబ గద్వాల జిల్లాలో బాలబాలికలకు వేర్వేరుగా ఎంపికలు జరిగాయని, అందులో ప్రతిభ కనబరచిన ప్రశాంత్, మహేశ్, మీనాక్షి, ప్రణవి, శిరీష రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు సిద్దిపేటలో బాలుర, ఈనెల 6వతేదీ నుంచి 8వ తేదీ వరకు ఖమ్మంజిల్లా కొత్తగూడెంలో బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

గంజాయి నూనె రవాణాదారుల అరెస్టు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై గంజాయి నూనె (హాష్ ఆయిల్)ను రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం ఏనుగొండ సమీపంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ధర్మేంద్ర రాయ్, నరెట్టమ్‌రాయ్ గంజాయి నూనెను హైదరాబాద్, రాయచూర్ ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఎండు గంజాయి ఆకులతో ఈ నూనె తయారు చేస్తారు. ఆ నూనెను మత్తు కోసం సిగరెట్ తాగేటప్పుడు వాడుతారు. గురువారం ఇద్దరు నిందితులు హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు గంజాయి నూనెను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం వచ్చింది. వారు మహబూబ్‌నగర్‌లోని పిస్తా హౌజ్ వద్ద తనిఖీలు చేయగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.25లక్షల విలువ చేసే గంజాయి నూనె లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శివ, సిబ్బంది మౌలాలీ, శివదాస్, భరత్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకుమారులపై దాడి: కేసు నమోదు

పాన్‌గల్, న్యూస్‌టుడే: బోరు మోటారు విషయంలో మాటమాట పెరిగి తండ్రీకుమారులపై దాడి చేసి గాయపర్చిన ఘటన గురువారం జమ్మాపూర్ చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రామకృష్ణ, పాలివారయిన సుగ్రీవుడు కుటుంబానికి కొంతకాలంగా బావి మోటారు విషయంలో వివాదాలున్నాయి. ఈ విషయంపై మాట్లాడుకుందామని భరత్, సుకేందర్, సుగ్రీవ కలిసి రామకృష్ణ, కుమారుడు నగేష్‌ను పిలిపించి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంసీహెచ్ ఆసుపత్రిలో శిశువు మృతి


ఆసుపత్రి తలుపులు మూసి నిరసన తెలుపుతున్న బాధితులు, విద్యార్థి సంఘాల నాయకులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వనపర్తి ఎంసీహెచ్ ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి పుట్టిన శిశువు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులు గురువారం ఆందోళన చేపట్టారు. వివరాలు.. చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామానికి చెందిన అనూష గర్భిణి. ప్రసవం కోసం వారం రోజుల క్రితం భర్త రాకేశ్, కుటుంబసభ్యులు ఎంసీహెచ్ ఆసుపత్రికి వారం తీసుకొచ్చారు. సాధారణ కాన్పు కోసం వైద్యులు చూశారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమెకు పురిటి నొప్పులు అధికం కావడంతో శస్త్రచికిత్స చేశారు. అప్పటికే శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని రాకేశ్, కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. ఆసుపత్రికి లోపలికి ఎవరూ వెళ్లకుండా తలుపులు మూసివేశారు. సమాచారం తెలుసుకున్న గ్రామీణ ఎస్సై జలేందర్‌రెడ్డి, సిబ్బంది చేరుకొని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం ఆర్ఎంవో బంగారయ్య, వైద్యురాలు చేరుకుని సాధారణ కాన్పు కోసం ప్రయత్నం చేశామని, శిశువు మెడకు పేగు చుట్టుకోవడంతో రక్తప్రసరణ జరగక మృతి చెందిందన్నారు. విధులను నిర్లక్ష్యం చేయలేదని చెప్పారు. ఎస్సై మాట్లాడుతూ అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో.. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని పెబ్బేరుకు చెందిన ప్రియాంక, భర్త అశోక్ ఆందోళన చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు గత నెల 22న ప్రియాంక ప్రసవం కోసం వనపర్తిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. రక్తపోటు అధికం కావడంతో వైద్యచికిత్స చేశారు. మంగళవారం ఆమెకు వైద్యులు సాధారణ ప్రసవం చేశారు. బుధవారం డిశ్చార్జి చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత శిశువు మృతి చెందడంతో గురువారం బాధిత కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : విధుల్లో నిర్లక్ష్యం, సీసీఏ నిబంధనలను పాటించని కానిస్టేబుళ్లు సస్పెండ్ చేశామని ఎస్పీ గిరిధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన కానిస్టేబుల్ రాకేశ్ హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జన సందర్భంగా బందోబస్తుకు వెళ్లి విధుల్లో చేరలేదు. సీసీఏ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్పీ విచారణ చేసి సస్పెండ్ చేశారు. పాన్‌గల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రామకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు హాజరు కాలేదు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను ఎస్పీ సస్పెండ్ చేశారు.

ఖాతా నుంచి డబ్బు మాయం.. కేసు నమోదు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఖిల్లాగణపురానికి చెందిన ఓ యువకుడి ఖాతా నుంచి డబ్బు మాయమయ్యాయి. ఎస్సై సురేశ్ గౌడ్ తెలిపిన వివరాల మేరకు ఖిల్లాగణపురం గ్రామానికి చెందిన సింగనమోని కృష్ణయ్య మహబూబ్‌నగర్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన స్వగ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎమ్‌లో రూ.20 వేలు జమ చేశారు. మరుసటి రోజు ఖాతా నుంచి రూ.రెండు వేలు డ్రా అయినట్లు ఆయన చరవాణికి సమాచారం రావడంతో ఏటీఎమ్ కార్డు పోగొట్టుకున్నట్లు గ్రహించిన బాధితుడు వెంటనే బ్యాంకుకు వెళ్లి ఖాతా పరిశీలించారు. రూ.14,300 గుర్తు తెలియని వ్యక్తులు డ్రా చేసినట్లు తెలుసుకున్నారు. గురువారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.